# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 11-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశంలో రెండు నూతన రైల్వే ప్రాజెక్టులకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది.
- ఎన్నికల విశ్వసనీయతను నిలబెట్టుకోవడంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక పాత్ర పోషిస్తోందని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు.
- ఈయూ భారత్ ల మధ్య పరస్పర అవగాహన ఉందని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు.
- జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈరోజు అమర్‌నాధ్ ఆలయాన్ని సందర్శించి తొలి పూజ నిర్వహించారు.
- యూపీఎస్సీ (UPSC) సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు ఈరోజు విడుదలయ్యాయి.

=====================

దేశంలో 6 వేల 405 కోట్ల రూపాయల వ్యయంతో రైల్వే శాఖ రెండు ప్రాజెక్టులను ఆమోదించింది. న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు తెలియచేస్తూ... కోదర్మ - బర్కాకానా రైల్వే మార్గం డబ్లింగ్ చేసే ప్రాజెక్టు కోసం 3 వేల 063 కోట్ల రూపాయలను కేటాయించామని వివరించారు. అలాగే బళ్లారి-చిక్‌జాజుర్ రైల్వే మార్గం డబ్లింగ్ కోసం 3 వేల 342 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లుగా పేర్కొన్నారు. కోదర్మ - బర్కాకానా డబ్లింగ్ ప్రాజెక్టు 133 కిలోమీటర్ల మేర సాగుతుందని, దీనివల్ల 938 గ్రామాలు 15 లక్షల జనాభాకు మెరుగైన రవాణా సదుపాయాలు దక్కుతాయని చెప్పారు. అదే విధంగా బళ్లారి-చిక్‌జాజుర్ డబ్లింగ్ రైల్వే మార్గం 185 కిలోమీటర్లుగా నిర్మాణం సాగుతుందని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ..

(వాయిస్ 40 సెకన్లు)

=====================

దేశవ్యాప్తంగా ఎన్నికల విశ్వసనీయతను నిలబెట్టడంలో కేంద్ర ఎన్నికల సంఘం కీలక పాత్ర పోషిస్తోందని ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేష్ కుమార్ తెలిపారు. స్టాక్ హోమ్ లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ... భారతదేశంలో ఎన్నికల జాబితాను నిర్వహించడం ప్రపంచంలోనే అత్యంత కఠినమైన, పారదర్శకమైన కార్యక్రమమని అన్నారు. దేశంలోని అన్ని గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీలకు చట్ట ప్రకారం ఎన్నికల జాబితాలను పంపిస్తామని ఆయన చెప్పారు. భారత ఎన్నికల కమిషన్ ప్రపంచంలోనే అతిపెద్ద సంస్థగా ఉందని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు.

=====================

జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈరోజు అమర్‌నాధ్ ఆలయాన్ని  సందర్శించి తొలి పూజ నిర్వహించారు, ప్రతీ సంవత్సరం జరిగే అమర్‌నాథ్ యాత్ర ప్రారంభ సూచికగా ఈ విధంగా చేయడం ఒక ఆనవాయితీగా ఉంది. ఈ సందర్భంగా సిన్హా పాత్రికేయులతో మాట్లాడుతూ... భక్తులందరూ పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమర్‌నాధ్ ఆలయాన్ని సందర్శించాలని కోరారు. అలాగే జమ్మూ కాశ్మీర్ పోలీసులు, సైన్యం, CRPF, CAPF బలగాలు ఈ యాత్ర కోసం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాయని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా జూలై 3వ తేదీ నుంచి అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం కానుంది. ఆగస్టు 9వ తేదీన రక్షా బంధన్ రోజుతో ముగుస్తుందని ఆలయ వర్గాలు తెలిపాయి. కాగా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా బాల్తాల్ బేస్ క్యాంప్ ఆసుపత్రిలో యాత్రికుల కోసం చేపట్టిన  వైద్య ఆరోగ్య సంరక్షణ ఏర్పాట్లను సమీక్షించారు.

=====================

అఖిల భారత సర్వీసుల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన యూపీఎస్సీ (UPSC) సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలు ఈ రోజు విడుదలయ్యాయి. దేశవ్యాప్తంగా మే 25న పరీక్ష నిర్వహించిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థుల రోల్ నంబర్లతో జాబితాను విడుదల చేసింది. ఈ పరీక్షలో అభ్యర్థులు సాధించిన మార్కులు, కటాఫ్ మార్కులు, ఆన్సర్ కీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయనున్నట్లు పేర్కొంది. అలాగే, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను సైతం యూపీఎస్సీ విడుదల చేసింది. ఐఎఫ్ఎస్ (మెయిన్) పరీక్షకు అర్హత సాధించిన వారి జాబితాను వేరేగా విడుదల చేసింది.

=====================

తత్కాల్ టికెట్ల బుకింగ్ కోసం జూలై 1 నుంచి ఆధార్ ఆధారిత ఓటీపీ గుర్తింపు కూడా తప్పనిసరి అని రైల్వే మంత్రిత్వశాఖ పేర్కొంది. తత్కాల్ టికెట్ల ప్రయోజనాల్ని నిజమైన వినియోగదారులకు మాత్రమే అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని రైల్వే మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.  ఇందుకోసం వినియోగదారులు వారు ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (IRCTC) వెబ్ సైట్ లేదా యాప్‌ను ఉపయోగించుకోవచ్చునని పేర్కొంది. జూలై 1 నుంచి ఆధార్ గుర్తింపు కలిగిన వినియోగదారులు మాత్రమే తత్కాల్ టికెట్లు బుకింగ్ చేసుకునేలా రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దళారీల ప్రమేయం లేకుండా చూసేందుకే ఈ నిర్ణయం   తీసుకున్నామని అధికారులు వెల్లడించారు.

విరామం

=====================

యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డర్ లయన్, ఈయూ విదేశాంగ చీఫ్ ఖాజా కల్లాస్‌లతో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఈ రోజు సమావేశం అయ్యారు. ఈయూతో ఉన్నత స్థాయి వాణిజ్య చర్చల కోసం బ్రస్సెల్స్ కు వెళ్లిన జైశంకర్ ఈ సమావేశంలో భారత్ ప్రాముఖ్యాన్ని వివరించారు. ఈయూకు భారత్ ఎంతో నమ్మకమైన వాణిజ్య భాగస్వామి అని కేంద్రమంత్రి చెప్పారు. 140 కోట్ల భారతీయుల్లో అనేక మంది నైపుణ్యం ఉన్న కార్మికులు ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలోనే పాకిస్థాన్ - భారత్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిణామాలపైన ఆయన

మాట్లాడారు. భారత్ - పాకిస్థాన్ ల మధ్య సమస్య కాదని, భారత్ ఉగ్రవాదం మధ్య సమస్య అని ప్రపంచం అర్థం చేసుకోవాలని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

=====================

జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఒడిశాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పూరీలో బలభద్రుడు, సుభద్ర, జగన్నాథుడికి ఈ రోజు పవిత్రస్నానం నిర్వహించారు. ఈ పవిత్రస్నాన ఘట్టాన్ని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 12వ శతాబ్దం నాటి ఆలయ ప్రాంగణంలోని స్నాన మండపంపై జరిగిన ఈ కార్యక్రమానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ సహా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. అయితే పవిత్రస్నానం జరిగే రోజును పూరీ జగన్నాథుడి పుట్టినరోజుగా సైతం భక్తులు జరుపుకొంటారు. ఈ పవిత్రమైన రోజునే స్వామివారు జన్మించారని విశ్వసిస్తారు.

=====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 82 వేల 391 వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై... చివరకు 123 పాయింట్ల లాభంతో 82 వేల 515 వద్ద ముగిసింది. నిఫ్టీ 37 పాయింట్ల లాభంతో 25 వేల 141 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.52 గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67.69 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3 వేల 354 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

=====================

ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సంబంధించిన సన్నాహక కార్యక్రమాలలో భాగంగా న్యూఢిల్లీలోని ఆకాశవాణి రంగ్ భవనంలో ఈ రోజు యోగాపైన కార్యశాలను నిర్వహించారు. ఈ సమావేశంలో జైపూర్ లోని జాతీయ ఆయుర్వేద సంస్థకు చెందిన స్వస్థత యోగా విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పునిత్ చతుర్వేది పాల్గొన్నారు.

=====================

ఉత్తర భారతదేశంలోని చాలా ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిల కంటే పెరిగాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. రాజస్థాన్, హర్యానా, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్, పంజాబ్ ఉతర ప్రదేశ్‌లో ఆరు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని పేర్కొంది.

=====================
=====================